కథా నిలయం
శ్రీకాకుళం

# ఇదీ ఈ దేశం

అది ఒక బస్టాపు!

రాత్రి పదిగంటలు దాటింది.

చుట్టూ చీకటి! ధనుర్మాసపు సీతగాలులు శరీరాన్ని ఒణికించేస్తున్నాయి. రోడ్డుకిరువైపులా వున్న వటవృక్షాలు గాలికి దెయ్యాల్లా ఊగుతూ అదోలాంటి శబ్దాలతో జనాన్ని భయపెడుతున్నాయి.

అక్కడ షెడ్ లాంటిదేం లేదు. ఎప్పుడో, ఏదో క్లబ్ వారు కట్టించిన షెల్టర్ మాత్రం దాదాపు శిథిలావస్థలో వుంది. అయితే దానిమీద రాయించిన పేర్లు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆ ప్రాంతాలవారు ఏవూరు వెళ్ళాలన్నా అక్కడికొచ్చి బస్సెక్కాల్సిందే. తరవాత మరో బస్సు మారతారే తప్ప ఆ బస్సెక్కకుండా మాత్రం తప్పుకోలేరెవరూ. ఒక్క స్వంత వాహనాలున్న వాళ్ళు తప్ప.

అలాగే ఆ రాత్రి అక్కడికి చాలామంది చేరారు బస్సు కోసం.

కొందరు దూరంగావున్న కాకా హోటల్లోనూ, మరి కొందరు కాస్త దగ్గరగావున్న సారాకొట్లోనూ కూర్చుని వారి వారి తాహతునుబట్టి ఒంట్లోని వేడిని పెంచుకుంటూ ఉత్సాహంగా కబుర్లాడుకుంటున్నారు.

అలాంటిచోట నాలుగ్గంటల్నించీ బస్సుకోసం ఎదురు చూస్తూ నిల్చున్నాడు రాజు.

బస్సులు వస్తున్నాయి, వెళ్తున్నాయి!

ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు, దిగేవాళ్ళు దిగుతున్నారు. కానీ అతనికి మాత్రం ప్రవేశంలేదు.

నిల్చుని నిల్చుని కాళ్ళు పీకుతున్నాయి.

రాజు ఇరవై రెండేళ్ళ యువకుడు.

పేదరానికి ప్రతినిధి!

నాలుగురోజుల క్రితం ఏదో ట్రయినింగ్ కోసం ఆ వూరొచ్చిన అతనికి పిడుగులాంటి వార్త అందింది టెలిగ్రాం ద్వారా.

'మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అంటూ.

రాజు వూపిరి క్షణం ఆగింది!

అసలు అతను బయల్దేరేముందే తల్లికి ఆరోగ్యం బాగా లేదు. హాస్పటల్లో చేర్పించి, డాక్టర్లు ఫరవా లేదన్న తరవాతే అతను బయల్దేరి వచ్చాడు. కానీ...ఇంతలో ఈ టెలిగ్రాం!

'సీరియస్' అంటే ... నిజంగా సీరియస్సా... లేక... తను కంగారుపడతాడని అలా ఇచ్చారా? ఒకవేళ నిజంగా అమ్మకేదయినా అయితే? అనుకుంటేనే అతనికి దుఃఖం ఆగటంలేదు.

తనని తాను ఓదార్చుకుని, గబగబా బేగ్‌లో నాలుగు గుడ్డలు పెట్టుకుని చెప్పవలసిన వారికి చెప్పి వరుగున యిక్కడి కొచ్చాడు. అయితే అతనికి బస్సుమాత్రం దొరకలేదు.

అతని తర్వాత వచ్చిన వాళ్ళంతా ఒక్కొక్కరే బస్సెక్కి వెళ్ళిపోతున్నారు.

ఇంతమందికి వున్న సీట్లు తనకి మాత్రం ఎందుకు లేవు? అని ప్రశ్నించుకుంటే-

"సీటు దొరకలేకపోవడమే" అంది మనసు.

"ఈసారెలాగయినాసరే బస్సు ఆగ్గానే తోసుకు మరీ ఎక్కుతాను" అనుకున్నాడు రాజు గట్టిగా.

దూరంగా ఏదో బస్సు వస్తున్న చప్పుడు!

రాజు కళ్ళు తళుక్కుమన్నాయి.

చటుక్కున లేచి నిల్చున్నాడు.

బస్సువచ్చి ఆగింది. అది వాళ్ళ వూరి బస్సే.

గబగబా ఎక్కబోయాడు.

"ఆగు, ఖాళీలేదు" అరిచినట్టు అన్నాడు కండక్టర్.

"నేను అర్జంటుగా వెళ్ళాలండీ, ప్లీజ్" బ్రతిమాలుతున్నట్టు అన్నాడు రాజు.

"ఇక్కడ అర్థరాత్రి చల్లో కూర్చుని బస్సుకోసం

ఎదురు చూస్తున్నారంటే అందరికీ అర్థంటే మరి" వెకిలగా నవ్వాడు కండక్టర్ మరో అతనికి టికెట్టిస్తూ.

అదో జోక్ అన్నట్టు కొందరు పకపకలాడారు.

"అదికాదండీ! మా అమ్మకి జబ్బుగా వుంది. నేను తప్పనిసరిగా వెళ్ళాలి. ప్లీజ్!"

"అరె! ఖాళీ లేదని చెప్పేది నీక్కాదూ? ముందు బస్సు దిగు."

"ప్లీజ్!"

"దిగు దిగవయ్యా! వెనకాల ఇంకో బస్సొస్తోంది మెక్క—" అంటూ ఒక్క తోపు తోశాడు కండక్టర్.

పడబోయి నిలదొక్కుకున్న రాజు నిస్సహాయంగా చూశాడు.

"రైట్ రైట్!" అంటూ ఓ పొలికేక పెట్టాడు కండక్టర్. బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

రాజుకి దుఃఖం వచ్చేస్తోంది.

"ఇప్పుడెలా వెళ్ళాలి? అమ్మనెలా చూడాలి?" పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు.

దూరంగా వున్న చర్చ్‌లోని గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

కాకా హోటల్ మూయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రాజు కళ్ళు చీకట్లు ముసురుకున్నాయి.

పొద్దుగూకేవేళకల్లా తిన్న పచ్చడి మెతుకులు హరించి పోయాయి. అలా నిస్త్రాణగా ఓ చెట్టు మొదట్లో కూలబడ్డాడు.

అతనికి తల్లి దండ్రులు, తన ఇల్లు గుర్తొచ్చాయి.

* * *

దశరథరామయ్యగారు పౌరోహిత్యం చేసుకు బ్రతికే ఒక పేద బ్రాహ్మడు. ఆయనకున్న ముగ్గురు సంతానంలో రాజు ఆఖరివాడు. అన్నలిద్దరూ తండ్రి ననుసరించినా అతను మాత్రం పౌరోహిత్యంమీద ఇష్టంలేక చదువులో పడ్డాడు. ఎలాగో కష్టపడి ఇంటర్ కాలేజి ఫస్టన పాసై గోల్డ్ మెడల్ కూడా సంపాదించుకున్నాడు.

అయితే ఇంక పై చదువులు చదవడం ఎంత కష్టమో గ్రహించిన రాజు అక్కడితో ఆ చదువు ఆపేసి, తమ వూరికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో వున్న మరో వూళ్ళో ఏదో ట్రైనింగు సెంటరుందని తెలిసి దానికి అప్లయ్ చేసుకున్నాడు. అతనికా సీటు తేలిగ్గానే వచ్చింది.

ఆ ట్రైనింగ్ పిరియడ్‌లో స్టయిఫండ్ కూడా ఇస్తారు. అందుకే రాజు ఆనందంగా బయల్దేరాడు. అయితే ఎన్నడూ తన యింటిని, తన వారిని వదలి వుండని కారణాన అంతదూరం వంటరిగా వెళ్ళాలంటే ముందు కాస్త దిగులుపడ్డాడు. అయినా కొన్నాళ్ళేగా అని సరిపెట్టుకున్నాడు.

అతనికి తల్లి దగ్గర బాగాచనువు. ఆవిడకూడా రాజు

ఆఖరివాడు కావడానో ఏమో కాస్త గారాబం ఎక్కువే. రాజుకి తల్లే ప్రాణం! తల్లే లోకం! తల్లిదగ్గర మరీ పసివాడిలా గారాలు పోయేవాడు. అన్నలు, ఇరుగు పొరుగులు అతన్ని అమ్మకూచి అని ఎక్కిరిస్తూండేవారు. అయినా అతను పట్టించుకునేవాడు కాదు.

ఇన్నాళ్ళు అమ్మ నొదిలి యెలా వుంటానో!" అనుకున్నాడు దిగులుగా.

రాజుని పంపడానికి డబ్బు కోసం అనేకచోట్ల ప్రయత్నం చేశాడు దశరథరామయ్యగారు. అయితే పైసా పుట్టలేదు.

ఆలోచించి, ఆలోచించి, మనసు కాస్త కష్టం కలిగించినా తన గోల్డ్ మెడల్ తాకట్టు పెట్టి అయిదొందల రూపాయలు తీసుకుని, ఓ వంద తండ్రికిచ్చి మిగతా నాలుగొందలు బేగ్‌లో పెట్టుకున్నాడు రాజు.

అయితే అనుకోని సంఘటన ఒకటి జరిగిపోయింది. రాజు రేపు వెళ్తాడనగా ఉన్నట్లుండి తల్లికి డమేరియా ప్రారంభ అయింది. ఆ వెంటనే డోకులు కూడా మొదలయ్యాయి.

కంగారుగా హాస్పటల్‌కి తీసికెళ్ళారు.

ఇక్కడ కాదని అక్కడా, అక్కడ కాదని ఇక్కడా తిప్పి తిప్పి ఉదయం వెళ్ళిన పేషెంట్‌ని సాయంత్రం అవుతుండగా దయతల్చి ఓ వందరూపాయలు పుచ్చుకుని మరీ చేర్చుకున్నాడు ధర్మాసుపత్రిలోని, ధర్మరాజులాంటి ఓ డాక్టరు.

రాజు ట్రైనింగ్‌కి వెళ్ళనని మొండికేశాడు. కాస్త

తీసుకున్న తల్లిదండ్రులు, అన్నలు అతనికి ధైర్యం చెప్పి వెళ్ళమన్నారు.

వందరూపాయల మత్తు వదలని డాక్టరు కూడా "మీ అమ్మగారికేం ఫరవాలేదు మేం వున్నాం వెళ్ళిరా" అంటూ అభయం యిచ్చి మరీ పంపాడు.

వెళ్ళడమైతే వెళ్ళాడుగానీ రాజు మనసు మనసులో లేదు. అమ్మకెలావుంది? తగ్గివుంటుందా? ఆఁ! తగ్గే వుంటుంది. ప్రశ్న, జవాబూ కూడా తనే చెప్పుకుంటూ గడిపాడు.

కానీ, ఈరోజు టెలిగ్రాం!

అతని కెందుకో తల్లి పోయిందనే అనిపిస్తోంది. అతని తృప్తికోసం సీరియస్ అని ఇచ్చుంటారు. అనుకున్నాడు.

అతని ధ్యేయమల్లా ఒకసారి అమ్మని కళ్ళారా చూడాలి. ఆమె చల్లని ఒడిలో తలదాచుకోవాలి. అదే. తను జీవితంలో ఇంకేం కోరుకోడు.

*　　*　　*

బస్సు హారన్ భయంకరంగా మోగింది. తృళ్ళిపడ్డ రాజు గభాల్న లేచి బస్సెక్కబోయాడు. "దిగు దిగు, ఖాళీలేదు." మామూలుగానే అరిచాడు కండక్టర్.

"ఖాళీ లేకపోతే ఏంచుకావాలి?" అని గద్దించాలనిపించింది రాజుకి. అయినా అవసరం తనది! అనుకుని—

"ప్లీజ్! మా అమ్మగారికి సీరియస్‌గా ఉంది. సీట్ లేకపోయినా పరవాలేదు నిల్చుంటాను. ఒక టికెట్ ఇవ్వండి" అన్నాను.

అతని గొంతులోంచి కోపం. దుఃఖం, బాధ, నిస్స హాయత్వం నేనంటే నేనని ముందు కురుకు తున్నాయి.

"ఈల్లేదు! ఇప్పటికే ఓవర్ లోడయింది." అంటూ నిర్దయగా అతన్నొదిలేసి, మరో ఇద్దర్ని ఎక్కించుకుని వెళ్ళి పోయాడు కండక్టర్.

కుప్పకూలిపోయిన రాజు మోకాళ్ళలో తలదాచుకుని పసివాడిలా భోరుమన్నాడు.

"బాబూ!" ఒక చల్లని పిలుపు.

చివ్వున తలెత్తి చూశాడు రాజు.

ఎదురుగా ఓ వృద్ధుడు.

"ఏడికెల్లాలి బాబూ?" అన్నాడు మెల్లగా. చెప్పాడు రాజు.

శానాబస్సులెల్లి పోయాయిగా?"

"ఎక్కించుకోలేదు." మరీ పసివాడిలా అన్నాడు రాజు.

పిచ్చి అవతారంలా ఉన్న అతన్ని బుజ్జగించి అన్ని వివ రాలూ తెలుసుకున్నాడా వృద్ధుడు.

"ఆ కండక్టరికి డబ్బేమైనా ఇచ్చావా?" అన్నాడు అను మానంగా.

"డబ్బా? టికెట్ కేనా?" అయోమయంగా అన్నాడు రాజు.

"కాదు నిన్ను బస్సెక్కనిచ్చినందుకు!"

"అదేంటి?" తెల్లబోయాడు రాజు.

"అదంతే! ఇటుకేసి బస్సులు ఎక్కువరాపు వచ్చినా మా రద్దీగా వుంటాయి! అయినా జనం మొక్కడం మాత్రం!

అందుకే సమయాన్నిబట్టి కండక్టరు డబ్బుచ్చుకుంటాడు. పొద్దు గూకితే మరీ రేటు పెరుగుద్ది" వివరించాడు ముసలతను.

"అంటే! లంచమన్నమాట."

"అయ్యొయ్యో పిచ్చిమారాజు! ఇయ్యన్నీ నీకొగా తెనాగుంది. ఈ పని నువ్ ముందేసేసుంటే ఈపాటికి సగం దూరం ఎల్లిపోయేవోడివి. పోన్లే! ఈసారి బస్సొచ్చినప్పుడు కండక్టరు సేతిలో ఓ పదిరూపాయలెట్టు."

"లంచం యిస్తావా? అని కసిరితే?" భయంగా అన్నాడు రాజు.

అతని అమాకత్వానికి జాలిగా నవ్వాడా వృద్ధుడు.

"ఏం ఫరవాలేదు. సాదార్నంగా ఇక్కడ జరిగే పనే అది. నీ కెందుకు ఈసారిచ్చి సూడు! నేనీకాడే వుంటాను. ఏదన్నా ఒత్తే నేను సూసుకుంటాను. ఇదే ఆకరిబస్సు...ఎలాగయినా ఎక్కెయ్యి" హెచ్చరించాడు వృద్ధుడు.

"అలాగే" అన్నట్టు తల ఊపాడు రాజు.

మరో పదినిమిషాల్లో బస్సొచ్చి ఆగింది. 'వెళ్ళు' అన్నట్టు రాజుని ముందుకు నెట్టాడు ముసలతను. రాజు ఎక్కాడు.

"దిగు దిగు, కాళీ లేదు" నెట్టబోయాడు కండక్టర్.

రాజు కంగారుగా ముసలతని కేసి చూశాడు. అతని చేతిలోని పదిరూపాయలనోటు నలిగిపోతోంది. లంచం ఇవ్వడంలో కూడా యింత కష్టం ఉంటుందని తెలియదతనికి.

"ఇవ్వు" అన్నట్టు సైగచేశాడు ముసలతను.

రాజు తెగించి నోటుని కండక్టర్ చేతిలో పెట్టి గుప్పెట

మూసి "ప్లీజ్" అన్నాడు చిత్రంగా. కండక్టర్ మొహం ప్రసన్నంగా అయిపోయింది.

"అదిగో, అక్కడ కూర్చోండి!" మాటలో కూడా మర్యాద. మసగబారిన కళ్ళతో రెండుచేతులూ జోడించి – "వెళ్ళొస్తా తాతా!" అన్నాడు రాజు ముసలతనితో.

"ఎల్లు బాబూ! మీ యమ్మకీపాటికి తగ్గిపోయే వుంటుంది" ధైర్యం చెపుతూ వీడ్కోలిచ్చాడు వృద్ధుడు.

"రైట్! రైట్!" ఉత్సాహంగా అరిచాడు కండక్టర్.

* * *

బస్సు గమ్యస్థానం చేరింది.

రాజు గబగబా లేచి బేగ్ అందుకున్నాడు.

ఒళ్ళు తూలిపోతోంది. శారీరకంగానూ, మానసికంగానూ అతను బాగా అలసిపోయాడు.

అలాగే తూలుతూ బస్సుదిగి ఓ రిక్షా ఎక్కి కూర్చుని ఏరియా చెప్పాడు.

'ఇప్పుడు అమ్మ ఏ స్థితిలో ఉంటుంది? బెడ్ మీదా? లేక వీధి అరుగుమీదా? అదీగాక ముంగిట అంతిమయాత్ర వాహానంమీదా?'

ఏమో! అమ్మ ఎక్కడున్నా ఒక్కసారి చూడాలి. నా ప్రాణాలు పోయినాసరే అమ్మని చూడాలి. ఆమె స్పర్శలోని చల్లదనాన్ని చివరిసారయినా అనుభవించాలి.

ఇదో! రామ్మందిరం కాడికొచ్చేసినం బాబూ అన్న రిక్షా వాడి మాటలకి త్రుళ్ళిపడ్డాడు రాజు.

దూరంగా తమ యిల్లు కనిపిస్తోంది.

హడావిడేం లేదు.

రిక్షా వాడు అడిగిన డబ్బు యిచ్చేసి గబగబా తన ఇంటి వేపు అడుగులు వేశాడు.

ఇంటి ముందు ఛాయలు చూసి కొయ్యబారిపోయాడు.

ఇంటి ముందు, నీళ్ళు, పూలు, దర్భలు, కాలిపోయిన పోయిన పిడకముక్కలు! అతనికి పరిస్థితిని విప్పి చెప్పాయి.

"అంటే...అమ్మ?...అమ్మా!" అంటూ పిచ్చివాడిలా ఇంట్లోకి పరిగెత్తాడు రాజు. బంధువులంతా గొల్లుమన్నారు.

"అమ్మని ఎప్పుడు తీసికెళ్ళారు?" పింతల్లిని కుదుపుతూ అడిగాడు రాజు.

అతనికి ఏడుపు రావడం లేదు.

"ఇప్పుడేరా నాయనా!" అంటూ అతన్ని పట్టుకుని బావురుమందావిడ.

తనని చుట్టిన ఆ చేతుల్ని విసురుగా విదిలించుకుని వీధి లోకి పరిగెత్తాడు.

అతని ప్రవర్తనకి బిత్తరపోయింది పినతల్లి.

"తొందరగా వెళ్ళరా నాయనా! వెంటనే వెళ్తే చూపందవచ్చు" వెనకనించి అరుస్తూ స్మశానం గుర్తులూ అవీ చెప్పాడు తాతగారు ఏడుస్తూనే.

రన్నింగ్ రేస్‌లా పరుగుతీశాడు రాజు. అతని. సైకిల్ తొక్కడం రాదు.

స్మశానం చాలా దూరం!

"ఎలా వెళ్ళాలి? ఎలా? ఎలా? ఎలా?"

దిక్కుతోచని రాజు సెంటర్లో నిల్చుని అటుకేసి వెళ్ళే కార్లనీ, స్కూటర్లనీ ఆపడానికి ప్రయత్నించాడు.

కొందరు ఆగి తిట్టిపోశారు.

మరికొందరు ఆగకుండానే-'పాపం! ఎవరో పిచ్చివాడు' అనుకుంటూ సాగిపోయారు.

కచ్చుగా జుట్టు పీక్కున్నాడు రాజు.

"రిక్షారానా బాబూ?" ఆశగా అడిగాడో రిక్షా వాడు.

"వద్దు!" అంటూనే దూరంగా ఓ ఆటో రావడంచూసి ఆశగా చప్పట్లు కొట్టాడు రాజు.

ఆటోవాడు చూసినా ఆగలేదు.

ఉసూరుమన్నాడు రాజు.

రెండు మూడు ఆటోలు అలా చూసీ చూడనట్లు వెళ్ళి పోయాక ఓ ఆటోవాడు దయతలచి ఆగాడు.

"ఎక్కడికి?" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆటోలో కూర్చుంటూ చెప్పాడు రాజు.

కళ్ళు చిట్లించి అనుమానంగా చూశాడు ఆటోవాడు.

"ప్లీజ్! తొందరగా పోనీండి. అర్జంట్!" వేడికోలుగా అన్నాడు రాజు.

"ముప్పయిరూపాయలవుతుంది" బీడీ నుసి విదిలిస్తూ తాపీగా అన్నాడతను.

"ముప్పయి రూపాయలా?" తృళ్ళిపడ్డాడు రాజు.

"అవును."

"మీటర్ కి అయిదు రూపాయలవుతుంది."

"పైన యింకో రూపాయిస్తాను" బ్రతిమాలాడు రాజు.

"కుదరదు."

"ఇది అన్యాయం!" నిస్సహాయంగా అరిచాడు రాజు.

"అన్యాయమో న్యాయమో! ఇస్తావా పొమ్మంటావా?" స్టార్ట్ చేస్తూ అన్నాడు ఆటో అతను.

కృంగిపోయిన రాజు కంగారుగా జేబులోని డబ్బుతీసి లెక్క చూసుకున్నాడు.

"ముప్పయి రూపాయలపైన ముప్పావలా వుంది పద" అన్నాడు ఆదుర్దాగా.

ఆటో అతను విజయగర్వంతో ఆటో స్టార్ట్ చేశాడు.

"కాస్త తొందరగా పోనీ!"

ఆటో సడన్ బ్రేకుతో ఆగింది కొంతదూరం వెళ్ళాక.

అక్కడేదో తగూ!

ట్రాఫిక్ జామ్ అయిపోయింది.

రాజు ముఖం పాలిపోయింది.

"బాబూ! ఈ తగూ యిప్పట్లో తేలేలా లేదు. మనం అలా పక్కనించి వెళ్దాం" అన్నాడు.

"అదెలా కుదురుతుంది? చాలా చుట్టు!"

తగూని వేడుగ్గా చూస్తూ అన్నాడు ఆటో అతను.

"నీకు డబ్బు ఎక్కువే ఇస్తున్నానుగా ప్లీజ్! అటువేపు పద."

"అలా ఐతే మరో పదిరూపాయలౌతుంది" నిర్దయగా అన్నాడతను.

కొయ్యబారిపోయాడు రాజు.

"అయినా నీ దగ్గర లేవుగా ... ఇంకేమిస్తావులే" అన్నాడు మళ్ళీ అతనే.

రాజుకి దిక్కుతోచ లేదు.

మరో పావుగంట తరువాత పోలీసులు రంగంలోకి రావడంతో గొడవ సద్దుమణిగింది.

ఆటో తిరిగి బయలుదేరింది.

ఆ కాస్సేపటిలో నరకమంతా అక్కడే అనుభవించాడు రాజు.

చివరికి ఎలాగో స్మశానం చేరుకుంది ఆటో.

ఒణుకుతున్న కాళ్ళతో దిగి ఆటోవాడికి డబ్బు యిచ్చేసి పరుగులాంటి నడకతో గేట్లోంచి లోపలికెళ్ళాడు.

కళ్ళు పత్తికాయల్లా చేసుకుని చూశాడు.

"అమ్మ ఏదీ?" అనుకుంటూ.

కా స్తదూరంలో తండ్రీ, బంధువులూ తడిబట్టలతో కని పించారు.

"నాన్నా!" అంటూ అరిచాడు రాజు.

ఇవతలగావచ్చి కొడుకుని పట్టుకుని భోరుమన్నాడు తండ్రి.

అన్నలుకూడా కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. అయితే రాజుకి మాత్రం ఏడుపు రావడంలేదు. అమ్మకోసం అతని కళ్ళు యింకా ఆశగా వెతుకుతూనే ఉన్నాయి.

"అమ్మ...?" అస్పష్టంగా అన్నాడు.

"ఇంకెక్కడి అమ్మరా బాబూ! పిడికెడు బూడిదై పోయింది!" గొల్లుమన్నాడు మేనమామ.

కొయ్యబారిపోయాడు రాజు.

అతని చెవుల్లో హోరు మొదలయింది,

"...ఇంతకీ...అమ్మ...ఎక్కడ?" తడారిన గొంతుతో అన్నాడు మండుతున్న నాలుగయిదు చితులను చూస్తూ.

"అదిగో!" ప్రజ్వరిల్లి ఆరిపోతున్న ఓ చితిని చూపించి కండువా నోటకుక్కుకున్నాడు తండ్రి.

రాజు మెల్లగా ఆ చితి దగ్గరగా వెళ్ళాడు.

చితి పక్కగా పసుపు కుంకుమలు, పూలు చిందర వంద రగా వుండి సుమంగళి చావుగా చెప్తున్నాయి.

"ఇంత తొందరగా అయిపోయిందా?" అన్నాడు రాజు మెల్లగా.

"అవున్నాయనా! కోలుకోవాలంటే నెలలు పడు

తుంది గానీ బూడిదవడానికి క్షణాలు పట్టదు. అందులోనూ పిట్టలాంటి మనిషి" కళ్ళు ఒత్తుకున్నాడు చిన్నాన్న.

చితిలోకే పరిశీలనగా చూస్తూ మౌనంగా నిల్చు న్నాడు రాజు.

"నాన్నా! నన్ను చూడ్డానికొచ్చావా?" అని తల్లి అడుగుతున్నట్లనిపించిందతనికి.

అతని ధోరణికి బిత్తరపోయిన బంధువులు భయంగా చూస్తున్నారతన్ని.

"అమ్మా!" అని అరుస్తూ చితిలోకి దూకబోయాడు రాజు హఠాత్తుగా.

బలవంతంగా అతన్నాపారంతా కలిసి.

కూర్చోబెట్టి మొహం కడిగారు.

అనునయ వాక్యాలు పలికారు.

"అంతా ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సిన వాళ్ళమే నాయనా! కాకపోతే కాస్త ముందు వెనకా అంతే" అంటూ స్మశాన వైరాగ్యం బోధించారు.

అయినా అవేం వినిపించడంలేదు రాజుకి.

తల్లి చల్లని రూపం గుర్తొస్తోంది.

ఆ వెంటనే తల్లిని హాస్పిటల్లో చేర్చడానికెళ్ళినప్పుడు అక్కడివారు చేసిన తాత్సారం, చూపిన నిర్లక్ష్యం. డబ్బు కోసం పీడించిన వైనం కళ్ళకి కట్టినట్లు కనిపిస్తోంది.

వెంటనే ట్రీట్‌మెంట్ జరిగితే అమ్మ బ్రతికేదా? ఏమో!

కానీ అమ్మ రూపాన్ని కడసారిగానయినా తను చూడ లేకపోవడానికి కారకులెవరు?

"అమ్మ కండిషన్ బానే ఉందని చెప్పి పంపిన డాక్టరా?

డబ్బుకోసం బస్సెక్కనివ్వని కండక్టరా? అదీగాక తన పేదరికాన్ని చూసి ఆపని ఆటో డ్రైవర్లా? పరిస్థితి గమనించి, ఉచ్చం, నీచం చూడకుండా అయిదురూపాయలు వచ్చే చోట ముప్పయి రూపాయలు గుంజిందేగాక ట్రాఫిక్ జామ్ అయితే నాలుగు గజాలు దూరం ఎక్కువవుతుందని పక్క నుంచి రాకుండా ఆ తగూనే వేడుకగా చూసిన ఆ ఆటో డ్రైవరా?

అదీగాక ఇన్ని అన్యాయాలు జరుగుతున్నా ఇంత అవినీతి పెరిగిపోయినా, ప్రజల సౌకర్యాలు తమకిపట్టనట్టు తప్పుకు తిరుగుతున్న ప్రభుత్వమా?

ఎవరు? ఎవరు? ఎవరు!

నా స్థితికి కారకులెవరు?

ఎవరూ కాదు?... నేనే... నా దుస్థితికి నేనే కారకుణ్ణి.

ధర్మానుపత్రిలో ధర్మం మాత్రమే వుండదని తెలియని నేనే బాధ్యుణ్ణి.

లంచం ఇవ్వడం చేతకాని నేనే ఓ తెలివి తక్కువ వెధవని!

కాదు! అన్నింటికీ మించిన మరో రాక్షసుంది.

అదే దరిద్ర దేవత!

నన్ను తన కబంధ హస్తాలతో కబళిస్తున్న దరిద్ర దేవత!

అవును. ఇవే కారణాలు! కానీ ఇంకెన్నడూ యిలా జరగనివ్వను. యువకులందరికీ లోకం పోకడ నేర్పుతాను. మేడి పండులాంటి ఈ సమాజంలోని కళ్ళని బైట పెడతాను.” ఇలా రాజుని ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి ఆలోచనలు.

“జై భారతమాతా!” హటాత్తుగా అరిచాడు రాజు. బిత్తరపోయారంతా.

“ఇది నా దేశం! పవిత్ర భారత దేశం.” పగలబడి నవ్వుతూ నినాదాలు చేస్తున్న రాజుని అతి బలవంతంమీద ఇల్లు చేర్చారు అతనివారు.

* * *

ఎప్పుడయినా మీరా వూరెళ్ళడం తటస్థపడితే జాగ్రత్తగా గమనించండి.

ఆ స్మశానంలోనికి, స్మశాన ప్రాంతాల్లోనో ఒక బక్కచిక్కిన యువకుడు.

“ఇది నా దేశం, ఇది పవిత్ర భారత దేశం. ఇది స్వతంత్ర భారత దేశం” అని అరుస్తూ మీకగుపిస్తాడు.

అతనే రాజు! అతన్ని చూసి జాలేస్తే రెండు కన్నీటి బొట్లు విడవండి. లేకపోతే “పాపం!” అన్నైనా అనుకోండి.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)

()—()